## విద్యా - ఉద్యోగ సమాచారం

### • డీఎస్సీకి తొలిరోజు 300 దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2024 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. తొలిరోజు 500 మంది ఫీజు చెల్లించగా, 300 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ సమగ్ర వివరాలతో కూడిన ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను విడుదల చేసింది. పరీక్షా విధానాన్ని సైతం ఖరారు చేసి వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ (స్కూల్ అసిస్టెంట్) మినహా అన్ని స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ టీచర్, భాషాపండితులకు 2:30 గంటలపాటు పరీక్షను నిర్వహిస్తారు. ఒక్క స్కూల్ అసిస్టెంట్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు మాత్రం మూడు గంటలపాటు పరీక్ష జరుగుతుంది. మిగతా పేపర్లకు 160 ప్రశ్నలు, 80 మార్కులు (ఒక్కో ప్రశ్నకు అరమార్కు) ఉండగా, స్కూల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ సైన్స్‌కు మాత్రం 200 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి.

### • ఒకేరోజు 13 మాల్‌ప్రాక్టీస్ కేసులు

**పరీక్షకు 23 వేల మంది డుమ్మా**

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఇంటర్ వార్షిక పరీక్షల్లో సోమవారం రికార్డుస్థాయిలో 13 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. పరీక్షలు ప్రారంభమైన తర్వాత ఇంత స్థాయిలో మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకావడం ఇదే మొదటిసారి. సంగారెడ్డి జిల్లాలో 11, నిజామాబాద్ జిల్లాలో 2 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. సోమవారం ఫస్టియర్ విద్యార్థులకు గణితం పేపర్-1ఏ, బోటనీ పేపర్లకు పరీక్షలను నిర్వహించారు. మొత్తం 5,32,683 మంది విద్యార్థులకు గాను 5,09,194 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇక 23,489 మంది విద్యార్థులు (4.4 శాతం) గైర్హాజరయ్యారు. పరీక్షకు అత్యధికంగా గైర్హాజరు కావడం ఇదే తొలిసారి. ఇంటర్మీడియట్ బోర్డు నియమించిన పరిశీలకులు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో తనిఖీలు నిర్వహించారు.

### • విత్‌హెల్డ్‌లో పెట్టారు.. పోస్టింగ్ ఇవ్వండి

ఖైరతాబాద్, మార్చి 4: గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో అర్హత సాధించినా తమను విత్‌హెల్డ్‌లో పెట్టారని, తమకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో అభ్యర్థులు రాఘవేంద్ర, నవనీత, అపర్ణ, శివాని, వినీత మాట్లాడారు. 1:1 నిష్పత్తిలో సుమారు 97 మంది ఎంపికయ్యామని తెలిపారు. ఇతర విభాగాల్లో నియామకం చేపట్టిన ప్రభుత్వం గణితానికి సంబంధించి విత్‌హెల్డ్‌లో పెట్టిందని వాపోయారు. దీంతో తమ అపాయింట్‌మెంట్లు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### • వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. బాలబాలికల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, పరుగు పందెం పోటీల్లో ప్రతిభ ఆధారంగా 10 మంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేయనున్నట్టు వెల్లడించారు. 4వ తరగతి ఉత్తీర్ణులై 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 83749 09268, 95535 54455 నంబర్ల ద్వారా తమను సంప్రదించాలని సూచించారు.

### • ఎస్సీ కార్పొరేషన్‌లో ఉచిత ఉపాధి శిక్షణ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత ఉద్యోగ, ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 3 నెలల వ్యవధితో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, డయాలిసిస్ టెక్నిషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరిల్లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని స్పష్టం చేశారు. 18 నుంచి 35 ఏండ్ల వయస్సు ఉండి ఎస్ఎస్‌సీ విద్యార్హత కలిగి ఉన్న నిరుద్యోగులు అర్హులని వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 98485 81100, 63091 64343 నంబర్ల ద్వారా తమను సంప్రదించాలని సూచించారు.

### • బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1కు కోచింగ్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ విషయాన్ని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డీ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ శిక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించని అభ్యర్థులు ఈ నెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రాడ్యుయేషన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం ఉచిత కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 040-24071178, 27077929 నంబర్ల ద్వారా తమను సంప్రదించాలని సూచించారు.

### • ఉచిత కోచింగ్ ఎప్పుడు?

- **ఆందోళనలో గ్రూప్ 1కు సిద్ధమవుతున్న బ్రాహ్మణ యువత**
- **ఇంతవరకూ వెలువడని నోటిఫికేషన్**

హైదరాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పరీక్ష కోసం సిద్ధమవుతున్న పేద బ్రాహ్మణ యువతకు ఉచిత కోచింగ్ విషయంలో సందిగ్ధం నెలకొన్నది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కోచింగ్ కోసం నోటిఫికేషన్లు వెలువడినప్పటికీ బ్రాహ్మణులకు సంబంధించి ఇంకా ఎలాంటి నోటిఫికేషన్ జారీకాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులతో పాటు పేద బ్రాహ్మణ యువతకు గ్రూప్-1 ఉచిత కోచింగ్ ఇప్పించింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా పేద బ్రాహ్మణ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్‌తో పాటు రూ. 5000 స్కాలర్‌షిప్ సైతం అందించారు. ఈ సారి కూడా ఉచితంగా కోచింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘాలు కోరుతున్నాయి.

### • ఉన్నత విద్యలో గ్లోబల్ వేల్స్ సహకారం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఉన్నత విద్యలో సహకారాన్ని అందించేందుకు యూకేకు చెందిన గ్లోబల్ వేల్స్ స్కిల్స్ ఫర్ దర్ ఎడ్యుకేషన్ ముందుకొచ్చింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ పర్యటనకు వచ్చిన బృందం రాష్ట్ర విద్యాశాఖ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యింది. తొలుత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి అధికారులతో ఈ బృందం భేటీ అయి సంప్రదింపులు జరిపింది. బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ గారెత్ విన్ ఓవెన్‌తోపాటు 12 మందితో కూడిన బృందం తెలంగాణ వర్సిటీలు, టీ హబ్‌లను సందర్శించారు. టీచర్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, షార్ట్‌టర్మ్ కోర్సులు, అక్కడి వర్సిటీల సహకారం, అప్రెంటిస్‌షిప్, ఉత్తమ విధానాలను పరస్పర మార్పిడిపై త్వరలోనే పరస్పర అంగీకారానికి రానున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, ప్రొఫెసర్ వీ వెంకటరమణ, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

### • ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి పీడీపీఎంఏ విజ్ఞప్తి**

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): తక్షణమే పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. బీబీఏ, బీసీఏ కోర్సుల అఫిలియేషన్‌ను యూనివర్సిటీల నుంచి ఏఐసీటీఈకి బదలాయించడాన్ని అడ్డుకోవాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. దోస్త్‌ను రద్దుచేసి, ఇంటర్ తరహాలో కాలేజీలే సొంతంగా అడ్మిషన్లు చేసుకునే వెసులుబాటు కల్పించాలని, ఫీజులను సవరించాలని కోరారు. సొంత భవనాలున్న కాలేజీలకు శాశ్వత గుర్తింపు, పదేండ్లు పూర్తి చేసుకున్న కాలేజీలకు ఐదేండ్లకొకసాని అఫియేషన్ జారీచేయాలని విన్నవించారు. మంత్రిని కలిసినవారిలో అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్కల్‌దేవి పరమేశ్వర్ ఉన్నారు.

### • మరో వారంపాటు పీఆర్సీ ప్రతిపాదనల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : వేతన సవరణకు ఏర్పాటు చేసిన పీఆర్సీ ప్రతిపాదనల స్వీకరణ గడువు మరో వారం రోజుల పాటు పొడగించారు. ఈ గడువు సోమవారంతో ముగియగా పలు సంఘాలు ఆఖరినిమిషంలో ప్రతిపాదనలు సమర్పించాయి. మరికొన్ని సంఘాలు గడువు కోరారు. ఈ నేపథ్యంలో మరో వారం వరకు ప్రతిపాదనలు సమర్పించవచ్చని పీఆర్సీ కమిటీ వర్గాలు వెల్లడించాయి. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు నేరుగా లేదా ఈ మెయిల్ ద్వారా తమ ప్రతిపాదనలు సమర్పించవచ్చని తెలిపాయి.



సోమవారం పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌కు ఉద్యోగుల వేతన సవరణ ప్రతిపాదనలను సమర్పిస్తున్న టీజీవో నాయకులు

# ఫిట్‌మెంట్ 40% ఇవ్వండి

**హెచ్ఆర్ఏ 28% అమలుచేయాలి**

- **పీఆర్సీ కమిటీకి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలు**

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పీఆర్సీపై భారీ ఆశలుపెట్టుకున్నారు. రెండో పీఆర్సీలో వేతనాలు గణనీయంగా పెంచాలని కోరుతున్నారు. 40% ఫిట్‌మెంట్ ఇవ్వాలని, హెచ్ఆర్ఏను గరిష్ఠంగా 28 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగుల వేతన సవరణపై అధ్యయనానికి గత కేసీఆర్ ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ నేతృత్వంలో పీఆర్సీ కమిటీని నియమించగా.. ఆ కమిటీ ప్రస్తుతం సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నది. సోమవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో), తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో),పీఆర్టీయూ టీఎస్, టీఎస్ యూటీఎఫ్, టీఎస్‌జీహెచ్ఎం అసోసియేషన్లు, పెన్షనర్ల జేఏసీ పీఆర్సీ కమిటీకి ప్రతిపాదనలు సమర్పించాయి. ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేసేందుకు కేరళ, కర్ణాటక రాష్ట్రాల వేతనాలు, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సూచీ, ద్రవ్యోల్బణం అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరాయి. టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, ముజీబ్‌హుస్సేని, టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, పీఆర్టీయూ నుంచి ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు తదితరులు పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌ను వేర్వేరుగా కలిసి ప్రతిపాదనలిచ్చారు.

**50% ఫిట్‌మెంట్‌నివ్వాలి: పీఆర్టీయూ టీఎస్**

ఉద్యోగులు, టీచర్ల కనిష్ఠ వేతనం రూ.35 వేలుగా నిర్ణయించి 50% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలని పీఆర్టీయూ టీఎస్ కోరింది. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీలు పూల రవీందర్, బీ మోహన్‌రెడ్డి, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి తదితరులు నివేదికలు పీఆర్సీ కమిటీకి నివేదిక సమర్పించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు పర్వత్‌రెడ్డి, సదానంద్‌గౌడ్ (ఎస్టీయూ), జంగయ్య, చావ రవి, (టీఎస్‌యూటీఎఫ్), రాజభాను చంద్రప్రకాశ్, రాజుగంగారెడ్డి (టీఎస్‌జీహెచ్ఎంఏ), నర్సిహులు, జగదీశ్ (ఆర్‌యూపీపీ), కృష్ణుడు (బీసీటీఏ), ఎస్ రామదాసు, ఇర్ఫాన్ (ఎస్‌జీటీఎఫ్), అశోక్‌కుమార్, కటకం రమేశ్ (టీఆర్‌టీఎఫ్), భిక్షంగౌడ్, చెన్నయ్య (పీఆర్టీయూ తెలంగాణ) తదితరులు పలు అంశాలపై నివేదికలను సమర్పించారు.

**సీపీఎస్‌ను రద్దుచేయాలి: సీపీఎస్ఈయూ**

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు గంగాపురం స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్ కోరారు. కేస్‌స్టడీస్‌తో కూడిన 20 పేజీల నివేదికను సమర్పించారు.

**40% వేతనాలు పెంచండి: పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్**

గ్రామ పంచాయతీ కార్యదర్శుల వేతనాలను 40% పెంచేలా సిఫారసు చేయాలని పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి కోరారు.

## టీఎన్జీవో సంఘం ప్రతిపాదనలు

- కనీస వేతనాన్ని రూ.19 వేల నుంచి రూ.35 వేలకు, గరిష్ఠ వేతనాన్ని రూ.1.62 లక్షల నుంచి రూ.2.99 లక్షలకు పెంచాలి.
- వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను 3.36-2.33% నుంచి 3.36-2.50 శాతానికి పెంచాలి. స్కేల్ ఆఫ్ పే గ్రేడ్స్‌ను 32 గ్రేడ్లుగా కొనసాగించాలి.
- హెచ్ఆర్ఏను జీహెచ్ఎంసీలో 24 నుంచి 27 శాతానికి, జిల్లా కేంద్రాల్లో 18.5, మండల కేంద్రాల్లో 14, ఇతర ప్రాంతాల్లో 11.5 శాతానికి పెంచాలి.
- పెన్షన్ మొత్తం పొందేందుకు కావాల్సిన సర్వీసును 25 నుంచి 15 ఏండ్లకు తగ్గించాలి. కనీస పెన్షన్ మొత్తాన్ని రూ.9,700 నుంచి రూ.17,500కు పెంచాలి.
- గ్రాట్యుటీ సీలింగ్‌ను రూ.16 లక్షల నుంచి రూ.24 లక్షలకు పెంచాలి.
- ఉద్యోగి అంత్యక్రియల సహాయాన్ని రూ.75 వేలకు పెంచాలి.
- ఇంటి నిర్మాణ అడ్వాన్స్‌ను వేతన స్లాబులను బట్టి కనిష్ఠంగా రూ.30 లక్షలు, గరిష్ఠంగా రూ.60 లక్షల వరకు పొందే అవకాశం ఇవ్వాలి. వివాహ అడ్వాన్స్‌ను కనిష్ఠంగా రూ.3 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.8 లక్షలు, ఎడ్యుకేషనల్ అడ్వాన్స్‌ను రూ.5 లక్షల వరకు పెంచాలి.

**టీజీవో సంఘం ప్రతిపాదనలు**

- వాస్తవ ద్రవ్యోల్బణ రేటు దృష్ట్యా 40% ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలి.
- హెచ్ఆర్ఏ హెచ్ఎండీఏ పరిధిలో 28%, జిల్లా కేంద్రాల్లో 20, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో 20, మండల కేంద్రాల్లో 17, ఇతర ప్రాంతాల్లో 15% చొప్పున అమలుచేయాలి.
- క్వాంటం ఆఫ్ ఇంక్రిమెంట్‌ను 2.7% నుంచి 3% ఉండాలి. స్టాగ్‌నేషన్ ఇంక్రిమెంట్లు 7 వరకు మంజూరుచేసి, తదుపరి పేస్కేల్‌ను వర్తింపజేయాలి.
- ఉద్యోగుల చందాతో ఈహెచ్ఎస్‌ను అమలుచేయాలి. స్కేల్‌ను అనుసరించి రూ.500 నుంచి రూ.800 వరకు ఉద్యోగుల నుంచి చందాగా తీసుకోవాలి.
- ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లను 5,10,15,20,25 ఏండ్లకు ఇవ్వాలి.
- కనీస వేతనాన్ని రూ.35వేలకు, గరిష్ఠ వేతనాన్ని రూ. 2.99 లక్షలకు పెంచాలి. గ్రాట్యుటీని గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు పెంచాలి.

**పెన్షనర్ల జేఏసీ ప్రతిపాదనలు**

- వయస్సుల వారీగా అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్ మొత్తాన్ని పెంచాలి. బేసిక్ పెన్షన్ మొత్తాన్ని 65-70 ఏండ్ల వారికి 15%, 75 ఏండ్లకు 25%, 80 ఏండ్లకు 35%, 85 ఏండ్లకు 45%, 90 ఏండ్లకు 55%, 95 ఏండ్లు దాటిన వారికి 10శాతం బేసిక్ పెన్షన్ అమలుచేయాలి
- పెన్షనర్లందరికీ 1% చందాతో ఈహెచ్ఎస్ స్కీమ్, రూ.20 లక్షల లోపు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ చేయాలి.
- మెడికల్ అలవెన్సును నెలకు రూ.600 నుంచి రూ.3వేలకు పెంచాలి.
- రెండేండ్లకొకసారి పెన్షనర్లకు తీర్థయాత్రల భత్యం రూ.50 వేలు అందజేయాలి.




ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య, నిరుద్యోగ యువతీ యువకులు

## టెట్, డీఎస్సీ ఒకేసారి నిర్వహించాలి

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య**
- **ధర్నాచౌక్‌లో వేలాది మంది నిరుద్యోగుల నిరసన ప్రదర్శన**

కవాడిగూడ, మార్చి 4: టెట్, డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఒకేసారి వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇవి రెండూ ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. సోమవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వేలాది మంది నిరుద్యోగులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ టెట్ వేయకపోవడం వల్ల బీఎడ్, డీఎడ్ పాసైన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 24 వేల పైచిలుకు పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- **సూర్యాపేట గ్రంథాలయం వద్ద నిరసన**



బొడ్రాయిబజార్, మార్చి 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం 20 వేల పోస్టులకు తగ్గకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన మినీ డీఎస్సీ ప్రకటనను వ్యతిరేకిస్తూ సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని గ్రంథాలయం ఎదుట ఉపాధ్యాయ ఉద్యోగార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 11,062 పోస్టుల్లో అధికంగా ఎస్జీటీ పోస్టులున్నాయని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,629 మాత్రమే ఉండడం బాధ కలిగిస్తుందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఎస్జీటీ అర్హత లేకపోవడం దారుణమని చెప్పారు. గత నోటిఫికేషన్‌కు ప్రస్తుత నోటిఫికేషన్‌కు ఎలాంటి పోస్టులు పెరుగలేదని వాపోయారు. ఈ మార్చిలో ఉద్యోగ విరమణతో ఖాళీ అయ్యేవాటితో కలిపి 24 వేల పోస్టులతో మెగా నోటిఫికేషన్ ఇవ్వాలని, టెట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చేపట్టిన డీఎస్సీ ధర్నాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్టు ప్రకటించారు.

# చదువుకోండంటే.. చంపేశారు

- **తోటి విద్యార్థిపై సహచరుల దాడి**
- **ఊపిరాడక డిగ్రీ విద్యార్థి మృతి**
- **ఏడుగురు నిందితుల్లో ఒకరు మైనర్**
- **బోధన్ బీసీ బాలుర హాస్టల్‌లో ఘటన**



వెంకట్ (ఫైల్)

శక్కర్‌నగర్, మార్చి 4: పరీక్షలున్నాయి.. శ్రద్ధగా చదువుకోండని చెప్పడం ఆ విద్యార్థి పాలిట శాపమైంది. అతడిపై కోపం పెంచుకున్న సహచర విద్యార్థులు అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఊపిరాడక అతడు దుర్మరణం చెందాడు. ఈ దారుణమైన ఘటన ఆదివారం రాత్రి నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బీసీ బాలుర కళాశాల వసతిగృహంలో చోటుచేసుకున్నది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పారం తండాకు చెందిన హరియాలి వెంకట్ (23) బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. స్థానిక బీసీ బాలుర హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ హాస్టల్‌లో డిగ్రీతో పాటు ఇంటర్ విద్యార్థులు సైతం వసతి పొందుతున్నారు. హాస్టల్‌లోని విద్యార్థులకు లీడర్‌గా వ్యవహరించే వెంకట్.. సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులను పర్యవేక్షించే వాడు. పరీక్షలు కొనసాగుతుండటంతో సహచరులను బాగా చదువుకోవాలని ఒత్తిడి చేసేవాడు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న ఏడుగురు విద్యార్థులు.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వెంకట్ నిద్రిస్తున్న గదికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఊపిరాడక వెంకట్ మృతి చెందాడు. దీంతో నిందితులు పారిపోయే క్రమంలో.. పక్కనే ఉన్న విద్యార్థులు నిద్రలేచారు. వారు వచ్చి చూసే సరికి వెంకట్ అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే నిందితులను పట్టుకున్నారు. సమాచారం అందుకున్న హాస్టల్ సంక్షేమ అధికారి స్వామి వచ్చి వెంకట్‌ను దవాఖానాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంకట్‌పై ఉద్దేశపూర్వకంగానే దాడి జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు పరమేశ్, నిఖిల్, శివ, ఇంటర్ సెకండియర్ చదువుతున్న దిలీప్, కృష్ణ, లక్ష్మణ్‌తోపాటు మరో మైనర్ కలిసి ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. తోటి విద్యార్థులు వెంకట్ తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి ఆందోళనకు దిగారు. పరిస్థితిని గమనించిన పోలీసులు అదనపు బలగాలను రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. పథకం ప్రకారమే తమ కుమారుడిని హతమార్చారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వెంకట్ తండ్రి జగ్గు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హాస్టల్ విద్యార్థి మృతి ఘటనలో సంక్షేమ అధికారి స్వామిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వాచ్‌మన్ గంగాధర్‌ను కూడా విధుల నుంచి తొలగించారు.

## 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి: తపస్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రెండో పీఆర్సీలో భాగంగా 50 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కోరింది. ఎస్జీటీ, సెకండరీ గ్రేడ్‌లకు మధ్యగల వేతన వ్యత్యాసాన్ని సవరించాలని విజ్ఞప్తి చేసింది. తపస్ ప్రతినిధి బృందం సోమవారం పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించింది. తపస్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్, అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య, భాస్కర్ దేశ్ తదితరులు ప్రతిపాదనలు సమర్పించిన వారిలో ఉన్నారు.

## వేతన స్కేల్‌ను స్థిరీకరించండి

**పీఆర్సీ కమిషన్‌కు నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్ల విజ్ఞప్తి**

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): పీఆర్సీ ప్రకటించి తమ వేతన స్కేల్‌ను స్థిరీకరించాలని నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నిషియన్లు సోమవారం పీఆర్సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. వైద్యారోగ్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్లు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. హోదాలకు అనుగుణంగా వేతనాలు స్థిరీకించాలని కోరారు. గెజిటెడ్ హోదా ఉన్న డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు రవాణా అలవెన్స్ కల్పించాలని విన్నవించారు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు గెజిటెడ్ హోదా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. ల్యాబ్ టెక్నిషియన్ల తరపున ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రతిపాదనలు సమర్పించారు. గత వేతన సవరణల్లో ల్యాబ్ టెక్నిషియన్ క్యాడర్‌కు అన్యాయం జరిగిందని ఆవేదన వెలిబుచ్చారు. ఈసారి న్యాయం చేయాలని, జీవిత కాల ఆరోగ్య ప్రమాదాలకు అలవెన్సు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




